సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



మట్టి గణపతికే జై..
గణపతి నవరాత్రోత్సవాల్లో మట్టి వినాయ ప్రతిమలను ప్రతిష్ఠించి పూజిద్దాం.. రసాయనాల నుంచి పర్యావరణాన్ని కాపాడుకుదాం. - 8లో▸



ప్రకృతి సేద్యంతోనే మనుగడ
ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్‌లో మానవ మనుగడ సాధ్యమని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31°/23°

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి.

న్యూస్‌రీల్

నిట్‌లో ఘనంగా టీచర్స్ డే



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో గురువారం టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ మాట్లాడారు. సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యాబోధన చేపట్టాలన్నారు. నిట్‌లో 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 12 మంది అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.

టీజీ ఐసెట్ విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్




కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో గురువారం ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి తెలిపారు. హెల్ప్‌లైన్ సెంటర్ అయిన ఈ కళాశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేశ్, హెల్ప్‌లైన్ సెంటర్ కోకన్వీనర్ డాక్టర్ అంజన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి : డీఐఈఓ



విద్యారణ్యపురి: విద్యార్థులు చదువుతోపాటు వివిధ రంగాల్లో రాణించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎ.గోపాల్ అన్నారు. గురువారం హనుమకొండలోని ప్రభుత్వ కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు, సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యను నేర్పిన గురువులను మరవకూడదన్నారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీధర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆత్మకూరు: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ లలితాదేవి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆమె గురువారం తనిఖీ చేశారు. రికార్డులు, మందులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ.. సేవలందించాలన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ స్పందన, సీహెచ్‌ఓ ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న సుధీర్‌కుమార్



హన్మకొండ కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం అందించే రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును హనుమకొండ విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ నడ్గాడ సుధీర్‌కుమార్ అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన గురుపూజోత్సవంలో సుధీర్‌కుమార్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

పురస్కారాలు అందుకున్న హనుమకొండ, వరంగల్ జిల్లాల ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ సారయ్య, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, ఇతర అధికారులు





నైతిక విలువలు బోధించాలి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

విద్యారణ్యపురి/ఖిలావరంగల్ : విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు బోధించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా గురువారం హనుమకొండ కలెక్టరేట్, వరంగల్ ఉర్సు గుట్ట ఆకుతోట కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనది.. గురువులే నవ సమాజ నిర్మాతలు.. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులేదనని అన్నారు. దేవుడు అన్నిచోట్ల ఉండడు కాబట్టే ఉపాధ్యాయులను సృష్టించి ఉంటారని అభిప్రాయపడ్డారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించడంతోపాటు అభివృద్ధి పథంలో పయనించేలా ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ కమిటీ'ల ద్వారా పనులు చేపట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఈఓలు డి.వాసంతి, మామిడి జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు హనుమకొండకు సంబంధించి 31 మంది, వరంగల్‌కు సంబంధించి 59 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అతిథులు పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.

కూలితేనే కదులుతారా?

- శిథిలావస్థకు చేరిన ఇళ్లపై చర్యలేవి?
- నోటీసులకే పరిమితమైన గ్రేటర్ వరంగల్ అధికారులు



వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సమీపంలో శిథిలావస్థకు చేరిన పురాతన భవనం

వరంగల్ అర్బన్: నగరంలోని పాత ఇళ్లు, భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో శిథిలావస్థకు చేరిన ఇళ్లు, భవనాలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. ప్రమాదకర స్థితిలో ఉన్న వాటిని గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేసిన గ్రేటర్ వరంగల్ అధికారులు మాత్రం వాటి కూల్చివేతపై అడుగు ముందుకు వేయట్లేదు. దీనికి రాజకీయ ఒత్తిళ్లు ఒక కారణమైతే.. వివిధ సాకులు చూపుతూ అధికారులు కాలం వెళ్లదీస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలం చెల్లిన భవనాల యజమానులకు ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతుందని అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందని ఆరోపణలున్నాయి.

పొంతన లేని లెక్కలు

నగరంలో 865 శిథిలావస్థకు చేరిన భవనాలు ఉన్నట్లుగా అధికారులు గతంలో గుర్తించగా, వాటిలో 707 భవనాలకు నోటీసులు జారీ చేసి కూల్చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 375 పాత భవనాల్ని గుర్తించి నోటీసులు జారీ చేశారు. అందులో కేవలం 45 వరకే నేలమట్టం చేశారు. 218 ఇళ్లను ఖాళీ చేయించారు. మిగిలిన 82 ఇళ్లలో అత్యంత ప్రమాదకరంగా 40 వరకు ఉన్నాయి. నగరంలో గుర్తించని పాత భవనాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఆ భవనాలకు నోటీసులివ్వలేదు. కనీసం వాటిని గుర్తించే నాథుడే కరువయ్యాడని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రై సిటీలో సుమారు 800 వరకు, విలీన గ్రామాల్లో 3 వేల వరకు శిథిలావస్థకు చేరిన భవనాలున్నట్లు అంచనా. కానీ.. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా వాస్తవాలను పక్కన పెట్టి వివరాలను నమోదు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

శ్రద్ధ ఏదీ?

అనేక పాత ఇళ్లు, భవనాలు ప్రమాణాల విషయంలో నిర్మాణాల నమూనాలు సేకరించి నాణ్యత నిర్ధారణ కోసం ఇంజనీరింగ్ విభాగానికి పంపించాలి. ఆపై వారి వద్ద ఉన్న నివేదిక ఆధారంగా ప్రమాదకర స్థాయిలో నిర్మాణాలను తొలగించే విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదు. గతంలో వరంగల్ నగరంలో చార్‌బౌళి, గిర్మాజీపేట, మండీబజార్, నర్సంపేట రోడ్డు, కాశిబుగ్గ, ఉర్సు కరీమాబాద్, తదితర ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలు, ప్రహరీలు కూలిపోయి సుమారు పది మంది ప్రాణాలు పోయాయి. ఇలా ఏటా వర్షాకాలం మొదలైదంటే చాలు ప్రజలు భయంతో వణికిపోతున్నారు. అవసాన దశకు చేరిన భవనాలు, ప్రహరీలు ఎప్పుడు కూలిపోతాయోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాలం చెల్లిన భవనాలు కూలిపోతున్నా.. రాజకీయ నేతల ఒత్తిళ్లు అంటూ.. అధికారులు దాటవేస్తున్నారనే విమర్శలున్నాయి.



వరంగల్ చౌరస్తా జంక్షన్‌లో..



మండిబజార్ సమీపాన..

ఎక్కడెక్కడంటే..

వరంగల్ నగరం పురాతనమైంది. అప్పట్లో చాలా మంది సాంకేతిక పరిజ్ఞానంతో భవంతులు నిర్మించుకున్నారు. వరంగల్ స్టేషన్ రోడ్డులో, గిర్మాజీపేట, చౌరస్తా, జేపీఎన్ రోడ్డులో 100 ఏళ్లు దాటిన ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలు ఉన్నాయి. అంతేకాకుండా.. 30 ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వరంగల్ మండీబజార్, పాపయ్యపేట చమన్, ఎల్లంబజార్, బొందలకుంట, రామన్నపేట, మట్టెవాడ, చార్‌బౌళి, గిర్మాజీపేట, స్టేషన్ రోడ్డు, పాత బీట్‌బజార్, మేదరివాడ, జేపీఎన్ రోడ్డు, దేశాయిపేట, కాశిబుగ్గ, గాంధీనగర్, ఖిలా వరంగల్ కోట, రంగశాయిపేట, ఉర్సు కరీమాబాద్, తదితర ప్రాంతాల్లో పాత భవనాలు ఉన్నాయి. కాజీపేటలోని దర్గా, సిద్ధార్థనగర్, సోమిడి, రైల్వే క్వార్టర్స్, హనుమకొండలోని వడ్డేపల్లి, కుమార్‌పల్లి, న్యూ శాయంపేట, మచిలీబజార్, బ్రహ్మణవాడ, న్యూ రాయపురా, పెద్దమ్మగడ్డ ప్రాంతాల్లో ఉన్నాయి. అంతేకాకుండా... 42 విలీన గ్రామాల్లో వందల సంఖ్యలో పాత ఇళ్లు ఉన్నాయి. ఇదే విషయమై వివరణ కోరేందుకు 'సాక్షి'.. బల్దియా ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ కార్యాలయానికి వెళ్లగా సంబంధిత అధికారి అందుబాటులో లేరు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదు.


డెంగీ పాజిటివ్ బాధితులకు పరామర్శ



డెంగీ జ్వరంతో బాధపడుతున్న మహిళను పరామర్శిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్

ఖిలా వరంగల్: మధ్యకోట, పడమర కోటలో విషజ్వరాలు, డెంగీ పాజిటివ్ కేసులు విజృంభిస్తున్నాయి. ప్రజల అభ్యర్థన మేరకు గురువారం ఖిలావరంగల్‌లో స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్, డాక్టర్ మోహన్‌సింగ్, డాక్టర్ నరేశ్‌తో కలిసి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు పర్యటించారు. విష జ్వరాలు, డెంగీ పాజిటివ్ బాధితుల ఇళ్లల్లోకి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. మందులను అందజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అంతర్గ వీధుల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలంతా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఏఎన్‌ఎం పవిత్ర ఆశా వర్కర్లు, శానిటేషన్ జవాన్లు పాల్గొన్నారు.

యథావిధిగా రైళ్ల రాకపోకలు



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్, వరంగల్ రైల్వేస్టేషన్ల మీదుగా ప్రయాణించే పలు రైళ్లను గురువారం నుంచి యథావిధిగా నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇంటికన్నె-తాళ్లపూసపల్లి రైల్వే ట్రాక్ ఘటనతో నాలుగు రోజుల పాటు పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. ఈమేరకు రైల్వే అధికారులు ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టి ట్రైన్స్‌ను రిస్టోరేషన్ చేసి యథావిధిగా నడిచేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పలు రైళ్లు నిర్ణీత సమయానికన్నా ఆలస్యంగా నడుస్తున్నాయి.

డీఎంఓలుగా సురేఖ, అనురాధ

వరంగల్: వరంగల్ జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, హనుమకొండ జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖను పరస్పర బదిలీ (వర్కింగ్ అరెంజ్‌మెంట్) చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు గురువారం తెలిసింది. వరంగల్ డీఎంఓగా బదిలీపై వచ్చిన అనురాధ జాయిన్ అయిన వెంటనే సెలవుపై వెళ్లారు. ఆమె స్థానంలో హనుమకొండ డీఎంఓ సురేఖకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బదిలీలపై నిషేధం ఉన్నందున ప్రభుత్వం పరిపాలన సౌలభ్యంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జిల్లా మార్కెటింగ్ అధికారుల స్థానాల్లో మార్పులు చేసినట్లు సమాచారం. అందులో భాగంగా వరంగల్, హనుమకొండ జిల్లాల డీఎంఓలు మారినట్లుగా సమాచారం.

నేడు జిల్లా స్థాయి పోటీలు

- వేదిక ప్రభుత్వ బాలికల పాఠశాల

విద్యారణ్యపురి: కాళోజీ జయంతిని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 6న (శుక్రవారం) జిల్లా స్థాయిలో ఆరో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ వాసంతి, జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. హనుమకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో (లష్కర్ బజార్)లో ఈపోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 4న జిల్లాలో పాఠశాలల స్థాయిలో కాళోజీ జీవితం-సాహిత్యం అంశంపై పాఠశాల స్థాయిలో ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు ఈనెల 6న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేలా చూడాలని హెచ్ఎంలు, ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు సంబంధిత గైడ్ టీచర్లతో సహా ఉదయం 9 గంటలకు చేరుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈపోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.1,500, ద్వితీయ బహుమతి రూ.1,000, తృతీయ బహుమతి రూ.500 చొప్పున నగదు అందజేయనున్నట్లు వివరించారు. బహుమతుల ప్రదానం వరంగల్ కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉంటుందని తెలిపారు. పోటీల నిర్వహణకు సంబంధించి సందేహాల నివృత్తి కోసం ఉపాధ్యాయుడు అలిగిరెడ్డి మధుసూదన్‌రెడ్డిని 98498 34110 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విధుల డబ్బులు చెల్లించాలి



ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

ఎంజీఎం : జిల్లాలో ఆశ వర్కర్లు చేసిన లెప్రసీ సర్వే -2023, 2024, పల్స్ పోలియో, ఎన్‌డీడీ సర్వేల డబ్బులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంఘం ఆధ్వర్యాన హనుమకొండ డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఎంహెచ్‌ఓ లలితాదేవికి అందజేశారు. ఈసందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఆశ వర్కర్లు చేసిన సర్వే డబ్బులు ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించలేదని, రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్ సర్వే డబ్బులు జిల్లా అధికారులకు విడుదల చేశామని చెబుతున్నా చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయడంతోపాటు క్రమబద్ధీకరించాలని పోరాటాలు చేస్తుండగా కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఆర్‌ఎంకి నిధులు తగ్గిస్తూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని దూరం చేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కె.పద్మ, నాయకులు సీహెచ్.రాజేశ్వరి, రజిత, కవిత, శ్రీవాణి, సూర్యకళ, కల్పన, రమాదేవి, సంధ్య, నవమణి, సుమలత, సునీత పాల్గొన్నారు.

చేపల చెరువు అక్రమాలపై విచారణ

- కేవీకేలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తనిఖీలు

సాక్షి, వరంగల్ : చేపల పెంపకానికి తవ్విన చెరువులోని మట్టిని అమ్ముకుని రూ.లక్షలు కాజేశారన్న ఆరోపణలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యులు గురువారం విచారణ చేపట్టారు. చీఫ్ సెక్రటరీ ఆదేశాల మేరకు మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో అక్రమాలపై లోతుగా ఆరా తీసినట్లు తెలిసింది. అధికారులతో మాట్లాడి అప్పటి ఫైళ్లను పరిశీలించారని సమాచారం. 2018 సంవత్సరంలో చేపల చెరువు కోసం తవ్విన మట్టిని అక్రమంగా రూ.80 లక్షలకు అమ్ముకున్నారని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో పాత అక్రమాలపై మళ్లీ విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ వ్యవహారంలో అప్పటి ఓ అధికారి పాత్ర ఉందని వారు అంచనాకు వచ్చి.. మరింత లోతుగా విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అప్పట్లో ఇక్కడ పనిచేసిన అధికారుల చుట్టూ ఉచ్చు బిగుస్తుందనే ఆందోళన నెలకొంది.

బస్టాండ్‌కు ట్రాఫిక్ కష్టాలు..



హనుమకొండ బస్టాండ్ రోడ్డులో ఆటోలతో నిలిచిన ట్రాఫిక్

ఆటోవాలాల ఇష్టారాజ్యం..

- ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన ప్రైవేట్ ఆస్పత్రులు, హోటళ్లు
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- సాధారణ వాహనదారులకు చుక్కలు
- పట్టించుకోని పోలీసులు, మున్సిపల్ అధికారులు



హనుమకొండ బస్టాండ్ ఎదుట ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన ప్రైవేటు ఆస్పత్రులు, రోడ్లపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

హన్మకొండ చౌరస్తా: వివిధ అవసరాల నిమిత్తం ఆర్టీసీ బస్సుల్లో హనుమకొండకు వచ్చిన ప్రజలకు బస్టాండ్‌లో దిగి రోడ్డు దాటాలంటే నరకం కనిపిస్తోంది. ఇక్కడి అస్తవ్యస్త ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. ఆటోవాలాల ఇష్టారాజ్యం.. పక్కనే ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లకు వచ్చేవారి వాహనాలతో రోడ్డు మొత్తం బ్లాక్ అవుతోంది. మరి ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు ఎక్కడా కంటికి కనిపించరు.

అటు ఇటు ఆటోలు.. మరోవైపు వాహనాలు..

నర్సంపేట, ములుగు నుంచి హనుమకొండకు వచ్చే బస్సులు బస్టాండ్ లోపలికి వెళ్లే దారి (మసీదు పక్కన)నుంచి ఉండగా, హైదరాబాద్ నుంచి వచ్చే బస్సులకు జంక్షన్‌నుంచి ఉంటుంది. కానీ ఈ రెండు వైపులా రోడ్డంతా గందరగోళంగా ఉంటుంది. మసీదు నుంచి జంక్షన్ వరకు సుమారు 200 మీటర్ల పొడవులో రోడ్డుకు అవతలి వైపు ప్రైవేట్ ఆస్పత్రులు, హోటళ్లు, లాడ్జీలు కొనసాగుతున్నాయి. బస్టాండ్ వైపు రోడ్డులో చిన్నపాటి పాన్‌షాపులు, టిఫిన్ సెంటర్లు, ఇతర దుకాణాలతో రద్దీగా ఉంటుంది. వివిధ ప్రాంతాలనుంచి బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులు బయటికి వచ్చే దారి వద్ద ఆటోలు పెద్ద సంఖ్యలో గుమిగూడి ఉంటాయి. ప్రయాణికులను పికప్ చేసుకోవడానికి ఆటో వాలాలు దర్జాగా రోడ్డుకు రెండువైపులా పార్కింగ్ చేసుకుని ఉంటున్నారు. ఇదీ చాలదన్నట్లుగా కొందరు ఆటోడ్రైవర్లు అక్కడక్కడే చక్కర్లు కొడుతూ ప్రయాణికులను పికప్ చేసుకుంటారు. 100మీటర్ల దూరం వెళ్లాలంటేనే పావు గంటకు మించి సమయం పడుతుందంటే అక్కడ ట్రాఫిక్ ఎంతగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ప్రైవేట్ ఆస్పత్రుల ఆక్రమణ..

బస్టాండ్ ప్రాంతంలో విచ్చలవిడిగా వెలిసిన ప్రైవేట్ ఆస్పత్రులు మున్సిపల్ కార్పొరేషన్ నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించాయి. పాదచారులు నడిచేందుకు వీలులేకుండా వాడుకుంటున్నాయి. ఆస్పత్రుల ముందు కనీసం బైక్ పార్కింగ్ చేయడానికి కూడా స్థలం ఉండదు. దీంతో ఆస్పత్రుల్లో చూపించుకునేందుకు వచ్చిన వారు వాహనాలను ఫుట్‌పాత్‌లు, నడి రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనదారులు, రోడ్డు దాటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కనిపించని ట్రాఫిక్ పోలీసులు

హెల్మెట్ లేకపోతే ఫొటో తీసి జరిమానా విధించే ట్రాఫిక్ పోలీసులు బస్టాండ్ ప్రాంతంలో ఒక్కరూ కనిపించరు. ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమైన ప్రైవేట్ ఆస్పత్రులు, ఆటోవాలాలు, హోటళ్ల ఎదుట పార్కింగ్ చేయకుండా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అప్పుడప్పుడు అడ్డావేసి అటుగా వెళ్లే వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారే తప్పితే రోజంతా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సిబ్బందిని నియమించకపోవడం వెనక మతలబు ఏంటో వారికే తెలియాలి.

క్లుప్తంగా

డిగ్రీ విద్యార్థుల ఆందోళన


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించి డిటెన్షన్ విధానం ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు గురువారం క్యాంపస్‌లో ఆందోళన చేపట్టారు. పరిపాలన భవనం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేస్తూ నిరసన నినాదాలు చేశారు. పరిపాలనభవనంలోనికి చొచ్చుకెళ్లే యత్నం చేయగా అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే బైఠాయించి ఆందోళన కొనసాగించారు. ఈ విషయం తెలుసుకున్న కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి అక్కడికి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలంటే స్టాండింగ్ కమిటీలో నిర్ణయం తీసుకోవాల్సింటుందన్నారు. డిటెన్షన్‌విధానంలో కూడా మార్పులు చేశామన్నారు. అనంతరం విద్యార్థులు రిజిస్ట్రార్ మల్లారెడ్డికి పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసి ఆందోళన విరమించారు.

వంగపహాడ్‌లో చోరీ

హసన్‌పర్తి : హసన్‌పర్తి పీఎస్ పరిధిలోని వంగపహాడ్‌లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ మేరకు బాధితుడు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వంగపహాడ్‌కు చెందిన సముద్రాల సాంబయ్య తల్లి ఇటీవల మృతి చెందింది. ఆచారం ప్రకారం బుధవారం సాయంత్రం సాంబయ్య దంపతులు కాజీపేటలో తన బామ్మర్ది ఇంటికి నిద్రకు వెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు ధ్వంసం చేసి కనిపించాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో రూ.15వేలు మాయమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

గంజాయి పట్టివేత

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు వ్యక్తులను సోదా చేయగా 4కిలోల గంజాయి లభించినట్లు సీఐ సుధాకర్ రెడ్డి గురువారం రాత్రి తెలిపారు. ఎస్సై నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా నలుగురు వ్యక్తులు పారిపోతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద శుద్ధి చేసిన ఎండు గంజాయి లభించింది. రేణుకుంట్ల శంకర్, కావేటి మేరీ, ఫ్రాన్సిస్ అర్పిత, వేల్పుల శ్యామ్‌ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. గంజాయి విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

కోతుల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

కమలాపూర్: మండల కేంద్రానికి చెందిన జక్కు లావణ్య కోతుల దాడిలో తీవ్రంగా గాయపడింది. గురువారం ఉదయం ఇంటి వద్ద పనులు చేసుకుంటున్న లావణ్యపై కోతులు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. దీంతో ఆమె కుడి చేయి విరిగింది. వెంటనే కుటుంబీకులు చికిత్స నిమిత్తం లావణ్యను హనుమకొండకు తరలించారు. కాగా, కొంత కాలంగా మండల వ్యాప్తంగా కోతుల దాడులు పెరిగిపోయాయని, ఇందులో అనేక మంది గాయాలపాలయ్యారని మండల ప్రజలు తెలిపారు. కోతుల బెడద నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

మట్టి వినాయకుడే శ్రేయస్కరం



వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాల విషయంలో పూర్తిగా భక్తి శ్రద్ధలు ఉండాలి. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే మట్టితో చేసిన ప్రతిమలనే ప్రతిష్ఠించి నవరాత్రులు పూజించడం శ్రేయస్కరం. మండపాలపై అందరూ మట్టి వినాయకులను ఏర్పాటు చేసుకోవాలి.

-గంగు ఉపేంద్రశర్మ, వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు, హనుమకొండ

పర్యావరణాన్ని కాపాడుదాం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో పాటు వినాయక ప్రతిమల కోసం వినియోగించే కెమికల్ రంగులతో పర్యావరణానికి ముప్పు కలుగుతుంది. ప్రకృతికి తీవ్ర హాని కలుగుతుంది. ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలి. మట్టి వినాయకులను ప్రతిష్ఠించుకుందాం. పర్యావరణాన్ని కాపాడుకుందాం.

- న్యాలకొండ భాస్కర్‌రావు, కన్వీనర్, వరంగల్ మహానగర్ గణపతి నవరాత్రి ఉత్సవ సమితి

ఇదే నా జీవనాధారం



వినాయక విగ్రహాల తయారీ పనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. వినాయక చవితి సమయాల్లో మాత్రమే తెలంగాణ వైపు వస్తాం. ఆ తర్వాత కోల్‌కతా వెళ్లిపోతాం. దసరా ఉత్సవాలకు సంబంధించి అక్కడ దుర్గాదేవీ విగ్రహాలు తయారు చేస్తాం.

- చందన్, కోల్‌కతా, విగ్రహాల తయారీదారుడు

మట్టి విగ్రహాలే శ్రేష్టం



20 ఏళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నా. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసే విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తుంది. ప్రతి ఒక్కరూ మట్టితో చేసే విగ్రహాలను పూజించాలి. వినాయక చవితి సమయంలో ఇలా ఉపాధి దొరుకుతుంది. మిగతా రోజుల్లో కోల్‌కతాకు వెళ్లి పనులు చేసుకుంటాం.

-భీష్మ, కోల్‌కతా, విగ్రహాల తయారీదారుడు

మట్టి గణపతికే జై..

మట్టి వినాయకులనే పూజిద్దాం
- పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం
- మొదలైన నవరాత్రోత్సవాల సందడి
- విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు


విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక విగ్రహాలు


కాజీపేటలో మట్టితో వినాయక విగ్రహం తయారు చేస్తున్న కళాకారుడు

హన్మకొండ కల్చరల్ : ఊరూ.. వాడ సందడిగా నిర్వహించే వినాయక చవితి సమీపిస్తోంది. ఉత్సవాలు ఈనెల 7న ప్రారంభం కానున్నాయి. ఇక ఒక రోజు మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే మండపాలను సిద్ధం చేసేపనిలో నిమగ్నమయ్యారు. అయితే పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ) విగ్రహాలను దూరంగా ఉంచి ఆదర్శంగా నిలవాల్సిన తరుణమిదే. పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను పూజించేందుకు ముందుకు రావాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈ దిశగా గ్రామాల నుంచి నగరం వరకు అందరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

పనులకు ఆటంకం కలగొద్దని పూజలు..

చేపట్టిన పనులు ఎలాంటి ఆటంకాలు, అడ్డంకులు రాకుండా నిర్విఘ్నంగా జరగాలని గణనాథుడిని పూజిస్తారు. గణనాయకుడు జన్మించింది పార్వతీదేవి మేనినలుగు మట్టి నుంచేనని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే మట్టి వినాయకుడిని పూజిస్తే చేపట్టే కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగి ముక్తి కలుగుతుందని విశ్వసిస్తారు. ప్రకృతి ప్రేమికులు సైతం వినాయకుడిని పూజిస్తే ప్రకృతిని ప్రేమించినట్లేనని చెబుతారు.

రంగులతో అనర్థం..

విగ్రహాల తయారీకి వినియోగించే రంగులు అనారోగ్యానికి అత్యంత హానికరం. వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసే సందర్భంగా నీటిలో ఈ రంగులు కలిసిపోవడం వల్ల నీరు కలుషితమవుతుంది. అంతేకాకుండా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలు ఏర్పాటు చేయడంతో వెలువడే విషవాయువుల వల్ల వాతావరణం కలుషితమై మానవాళికి ముప్పు ఏర్పడుతుంది.

మట్టి వినాయకుడితో ఉపయోగాలు ..

మట్టి వినాయకుడిని పూజించడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. ప్రకృతిని పూజించే అవకాశం కలుగుతుంది. నిమజ్జనం సందర్భంగా మట్టి నీటిలో సులభంగా కరుగుతుంది. నీటిలోని జీవరాసులకు ఎలాంటి హాని కలగదు. అదేవిధంగా నీరు కూడా కలుషితం కాదు.

మూడేళ్లుగా మట్టి వినాయకుడినే ప్రతిష్ఠిస్తున్నాం..



ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో కలిగే అనర్థం ప్రజలకు ఇప్పటికే అర్థమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తుండడం బాగానే ఉన్నా.. ఎంత మంది మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజిస్తున్నారనే విషయం ముఖ్యం. మూడేళ్లుగా మా కాలనీలో మట్టి గణనాథుడినే ప్రతిష్ఠిస్తున్నాం.

-అరూరి సాంబయ్య, విష్ణుపురి కాలనీ, కాజీపేట

మట్టి వినాయకులను పూజిద్దాం

- వరంగల్ ఎంపీ కావ్య


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ కావ్య, తదితరులు

హన్మకొండ చౌరస్తా: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజిద్దామని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యాన రూపొందించిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ, వాల్ పోస్టర్లను హనుమకొండలోని నివాసంలో గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ రసాయన రంగులు అద్దిన విగ్రహాల ద్వారా నీరు కలుషితం అవుతుందని, తద్వారా అందులోని జలచరాలు మృత్యువాత పడతాయని చెప్పారు. పండుగలను ప్రకృతి హితంగా జరుపుకుంటూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులం అవుదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొల్ల శరత్‌చంద్రారెడ్డి, జాతీయ కార్యదర్శి సీహెచ్.సాగర్, జనగామ జిల్లా అధ్యక్షుడు నీలం యువరాజు, అరవింద్, రవి, ఉదయ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

- నలుగురు అరెస్ట్
- రూ.31,570 స్వాధీనం

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి కోమటిపల్లిలోని పేకాట నిర్వహిస్తున్న ఓ కేంద్రంపై గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా నలుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.31,570, నాలుగు మొబైల్, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కోమటిపల్లిలో ఓ స్థావరంలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న గోపాలపురానికి చెందిన ముస్కే అవినాష్, ఆడెపు శ్రీశైలం, అనకొండ నరేశ్, పలువేల్పులకు చెందిన శ్రీరాముల నాగరాజును అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈదాడుల్లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్ల ఎంపికలో అవకతవకలు జరగలేదు

కమలాపూర్ : వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంజేపీ గురుకులాల్లో (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్) గెస్ట్ టీచర్ల ఎంపికలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సూచనల మేరకు గెస్ట్ టీచర్ల నియామకానికి సంబంధించి డెమోలు పారదర్శకంగా నిర్వహించారని గెస్ట్ టీచర్ల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా బాధ్యులు ఆర్.గోవర్ధన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గెస్ట్ టీచర్ల ఎంపికలో డబ్బులు చేతులు మారినట్లు వరంగల్ ఉమ్మడి జిల్లా ఆర్సీఓపై వస్తున్న నిరాధార కథనాలు, ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కొందరు తొలగించబడిన గెస్ట్ టీచర్లు పని కట్టుకుని పలు అసభ్యకర, రాయలేని భాషలో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి నిరాధార ఆరోపణలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ప్రకృతి సేద్యంతోనే మానవ మనుగడ

- త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి


మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

కేసముద్రం: ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్‌లో మానవ మనుగడ సాధ్యమని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామంలో అభినవ్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా అభినవ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం అవసరమని, ఆర్గానిక్ పంటల సాగు ద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో దృఢంగా ఉంటారన్నారు. ప్రధానమంత్రి మోదీ సులభతరమైన పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు డ్రోన్ పథకం ద్వారా డ్రోన్, ఇతర పరికరాలను సబ్సిడీపై ఇస్తున్నట్లు పేర్కొన్నారు. త్రిపురతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఆర్గానిక్ పంటలకు అధిక ప్రాధాన్యం ఇస్తారని, ప్రధాని చేపట్టే ప్రతీ కార్యక్రమంలో ఆర్గానిక్‌తో కూడిన వంటకాలనే భోజనంగా అందిస్తారని తెలిపారు. అనంతరం డ్రోన్‌లను పరిశీలించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. ప్రతీరైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని, సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు తప్పకుండా మార్కెట్లో ధర లభించేలా తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రముఖ ప్రకృతి సాగు శిక్షకుడు విజయరాం మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వినియోగంతో పండించే పంటలను తినడం వల్ల ఎసిడిటీ వస్తుందని చెప్పారు. తాము 15 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నామని, ఆ పంటనే తిరుపతిలో శ్రీవేంకటేశ్వరస్వామి వద్ద నైవేద్యం సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు భూతాపాన్ని తగ్గించేలా వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచించారు. ముందు త్రిపుర గవర్నర్‌కు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం చేశారు. సాల్లేటి జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డేవిడ్, డీపీఓ విజయనిర్మల, ఆర్డీఓ అలివేలు, డీఎస్పీ తిరుపతిరావు, తహసీల్దార్ దామోదర్, ఏఓ వెంకన్న, శాస్త్రవేత్త క్రాంతికుమార్, సంకు శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏసోబు అంత్యక్రియలు

- నివాళులర్పించిన మాజీ మావోయిస్టులు, రాజకీయ నాయకులు
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు, స్థానికులు
- ఎరుపెక్కిన టేకులగూడెం గ్రామం


టేకులగూడెంలో ఏసోబు అంతిమయాత్ర


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మడికొండ: ఛత్తీస్‌గఢ్ బార్డర్‌లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర మిలిటరీ ఇన్‌చార్జ్ మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ దాదా రణదేవ్ అంత్యక్రియలు గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెంలో అశ్రునయనాల మధ్య జరిగాయి. కుటుంబ సభ్యులు ఏసోబు మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉదయం 9 గంటల సమయంలో గ్రామానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎర్ర జెండాలు రెపరెపలు, విప్లవ గేయాల మధ్య అంతిమయాత్ర సాగింది. తరలివచ్చిన మాజీ మావోయిస్టులు, రాజకీయ నాయకులు నివాళులర్పించారు. స్థానిక ఎస్సీ కాలనీ సమీప శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మాచర్ల ఏసోబుకు విప్లవ జోహార్లు అంటూ.. నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మావోయిస్టులు భారతక్క, గాదె ఇన్నయ్య, గాజర్ల అశోక్, న్యూడెమాక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, ఎలకంటి రాజేందర్, గంగుల దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర సీడ్ ఆయిల్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కార్పొరేటర్లు, బంధుమిత్రుల సంఘం సభ్యులు, స్థానిక నాయకులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

కల్లెడ ఆణిముత్యం దీప్తి..

- పారాలింపిక్స్‌లో పతకం తేవడంతో అంతర్జాతీయంగా పేరు
- ఊరే గెలిచినట్టుగా సంబరాలు.. తల్లిదండ్రుల్లో ఆనందం
- వైకల్యం ఉన్నా పట్టుదలలో కనిపించని లోపం



ఊరిలో ఏర్పాటు చేసిన బ్యానర్

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామం.. ఇప్పుడు ఈ పేరు అంతర్జాతీయ యవనికపై మార్మోగుతోంది. ఎందుకంటే పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో ఈ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తి కాంస్య పతకం సాధించడమే. ట్విట్టర్లు, ఇన్‌స్టాగామ్ వేదికగా ఆమె విజయాన్ని అందరూ స్మరిస్తుంటే.. గ్రామస్తులు మాత్రం ఆమె పతకం అందుకునేందుకు పడిన శ్రమను గుర్తు చేసుకుంటూ కీర్తిస్తున్నారు. దీప్తితో చదివిన స్నేహితులు, గ్రామ ప్రజలతోపాటు తల్లిదండ్రులు సంబరపడుతున్నారు. దివ్యాంగురాలైన దీప్తి జీవితం ఎలా ఉంటుందని అనుకున్న గ్రామస్తులు.. పారిస్‌లో కాంస్య పతకం సాధించడాన్ని చూసి కూతురంటే ఇలా ఉండాలి అని అంటున్నారు. ఆమె గెలిస్తే ఊరే గెలిచినట్టుగా సంబరాలు చేసుకుంటున్నారు.

ఊరే గెలిచినట్టుంది..



మా కూతురిని చూసి చాలా మంది ఎలా ఉంటుందోనని అంటుండేవారు. ఆ సమయంలో నాకు కూడా చాలా ఇబ్బందిగా అనిపించేది. రన్నింగ్‌లో చిరుతలా పరుగులు తీస్తూ పతకాలు తెస్తుంటే మా ఆనందానికి అవధులు లేవు. పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో మహిళల 400 మీటర్ల టీ20 కేటగిరీ ఫైనల్లో మూడో స్థానంలో కాంస్య పతకం తీసుకురావడంతో నా జన్మకు ఇక ఇది చాలు అనిపించింది. మా గ్రామమే గెలిచినట్టుగా సంబరాలు చేసుకోవడం చూస్తుంటే మాటలు రావడం లేదు. వైకల్యాన్ని అధిగమించి దేశమే గర్వపడే విధంగా నిలిచిన దీప్తికి ప్రభుత్వం ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలి. ఆమెను ప్రోత్సహిస్తే ప్రపంచ స్థాయిలో మరిన్ని పతకాలు భారత్‌కు రావడం ఖాయం.

-యాదగిరి, దీప్తి తండ్రి

పారిస్‌లో పరుగులు..



చిన్నప్పటి నుంచి పరుగు పందెం అంటే దీప్తి ఆసక్తి చూపేది. స్నేహితురాళ్లతో కలిసి గ్రామంలో పరుగులు తీసేది. వైకల్యం ఉన్నా తనలో కనిపించకుండా జాగ్రత్త పడుతూ మనో ధైర్యంతో ముందుకెళ్లింది. పాఠశాలలో నిర్వహించే ఆటల్లో ఎప్పుడూ మొదటి స్థానంలో నిలిచేది. అలా ఆమెలో ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించాం. ఆ సమయంలో ఉపాధ్యాయులు కూడా ప్రోత్సహించడంతోనే ఇప్పుడూ పతకాలు తీసుకురాగలుగుతోంది. పేదరికం ఉన్నా ఎక్కడ పోటీలకు వెళ్లినా తిరస్కరించలేదు. కల్లెడ నుంచి పారిస్ వరకు నా కూతురు పయనం ఉండడం, చిన్నప్పుడు కల్లెడలో చేసిన పరుగులే...ఇప్పుడూ పారిస్‌లో నాకు కనిపించాయి. కాంస్యం సాధిస్తే దేశమే గెలిచినట్టు ఉంది. ముఖ్యంగా మా ఊరే గెలిచినట్టు సంబరాలు చేసుకోవడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి. -ధనలక్ష్మి, దీప్తి తల్లి

కల్లెడకు పేరు తెచ్చింది..



దీప్తిని నా చిన్నప్పటి నుంచి చూస్తున్నా. కల్లెడలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో కలిసి ఒకటి నుంచి ఆరో తరగతి వరకు కలిసి చదివాం. ఆ సమయంలోనే వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు జనవరి 26, ఆగస్టు 15 సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించేవారు. ముఖ్యంగా పరుగు పందెంలో దీప్తి మొదటి వరుసలో ఉండేది. బహుమతులు గెలుచుకునేది. పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లోనూ పతకం సాధించేందుకు తీసిన పరుగులు చూస్తుంటే చిన్నతనంలో ఉన్న ఆ కసినే కనిపించింది. నా స్నేహితురాలు దేశం గర్వించే విధంగా రాణించడం ఆనందంగా ఉంది. కల్లెడకు మంచి పేరు తీసుకొచ్చింది. -మల్యాల రమ్య, స్నేహితురాలు

గ్రామస్తులకే గర్వకారణం..



దీప్తి ఏది అనుకుంటే అది సాధించడంలో దిట్ట. ఆమెకు వైకల్యం కూడా అడ్డు రాలేదు. పారిస్ పారాలింపిక్స్‌లో పతకం సాధించడం ఆమెకే కాదు ఊరికే గర్వకారణం. చిన్నప్పటి నుంచి కొందరు ఆమెను అవహేళన చేసినా, ఇప్పుడు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ప్రముఖులతో శెభాష్ అనిపించుకోవడం కల్లెడ గ్రామ పేరు ప్రతిష్ఠను ఇనుమడింపజేసేలా చేసింది.

- ముదురుకుల్లా రమేశ్, కల్లెడ

భర్త నుంచి ప్రాణభయం

- పోలీస్‌స్టేషన్‌లో భార్య ఫిర్యాదు

హసన్‌పర్తి: భర్త నుంచి తనకు ప్రాణభయం ఉందని భార్య హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. బాధితురాలు, పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం అర్వపల్లికి చెందిన పల్లవికి సూదన్‌పల్లికి చెందిన చైతన్యతో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు ఉంది. కొంతకాలం పాటు వీరి దాంపత్య జీవితం సాఫీగా సాగింది. అనంతరం వీరికుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. అదనపు కట్నం కోసం చైతన్య.. భార్యను వేధించడం ప్రారంభించాడు. పెద్ద సమక్షంలో పంచాయితీ నిర్వహించినా మార్పు రాలేదు. ఆరు నెలల క్రితం భార్యను గదిలో నిర్బంధించి మానసికంగా,శారీరకంగా వేధించాడు. ఈవిషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పల్లవిని అర్వపల్లికి తీసుకెళ్లారు. కాగా, రెండు , రోజుల క్రితం అర్వపల్లికి వచ్చిన చైతన్య తన భార్యతో పాటు ఆమె తల్లి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇల్లు రాసి ఇవ్వమని పల్లవి తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా పల్లవి తల్లిదండ్రుల తోపాటు సోదరుడిని చంపుతానని బెదిరింపులకు గురిచేస్తున్నాడు. ఈ ఘటనపై తన భర్త చైతన్యతో పాటు అందుకు సహకరిస్తున్న మరిది సతీశ్‌పై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

'కాళేశ్వరం' కేసు వచ్చే నెల 17కు వాయిదా

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టులో అవినీతిపై భూపాలపల్లికి చెందిన వ్యక్తి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా కోర్టుకు గురువారం మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, కాంట్రాక్టర్ మెగా కృష్ణారెడ్డి, అధికారులు సబర్వాల్, రజత్‌కుమార్, ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధుల తరఫున న్యాయవాదులు నరసింహారెడ్డి, ఆదానీ హాజరయ్యారు. జడ్జి నారాయణబాబు కేసును వచ్చే అక్టోబర్ 17వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిసింది.

విధుల్లో అలసత్వం ఉండొద్దు

- ఆర్‌జేడీఎం, పర్సన్ ఇన్‌చార్జ్ ఉప్పుల శ్రీనివాస్

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఆర్‌జేడీఎం, మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. ఇటీవల మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి వచ్చిన సందర్భంలో చాంబర్ ప్రతినిధులు, కూరగాయల మార్కెట్ వ్యాపారులు పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. డైరెక్టర్ సూచనల మేరకు పర్సన్ ఇన్‌చార్జ్‌గా జేడీఎం గురువారం వరంగల్ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో నిర్వహించిన అంతర్గత సమావేశంలో మార్కెట్ పరిస్థితులు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుమాములలోని గ్రేయిన్ మార్కెట్, లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్‌లలో అధికారులు, ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది హాజరును సంబంధిత సూపర్‌వైజర్ రోజూ తీసుకో వాలని ఆదేశించారు. ఎవ రు ఎక్కడ పనిచేస్తున్నారనే విషయంపై సంబంధిత ఇన్‌చార్జ్‌లు దృష్టిసా రించాలన్నారు. మార్కెట్‌లలో పారిశుద్ధ్య పనులు పొందిన కాంట్రాక్టర్లు మార్కెట్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త, మురిగిన కూరగాయలు ఉంటే సంబంధిత కాంట్రాక్టర్ల బిల్లుల్లో కోత తప్పదని హెచ్చరించారు. లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని కమీషన్ వ్యాపారులు, కవర్ షెడ్ వ్యాపారులతో మాట్లాడి అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో డీడీఎం పద్మావతి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, గ్రేడ్–2 కార్యదర్శులు శ్రీరామోజు రాము, ఎఎస్‌లు అనిల్, రాజేందర్, అకౌంటెంట్ సుకన్య పాల్గొన్నారు.